క్లుప్తంగా

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి



తెలకపల్లి: డాక్టర్ బాబాసాహేబ్ అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని బీసీ సంఘం నాయకుడు శ్యాం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని యోగా భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14న అంబేద్కర్ జయంతిని కులమతాలకు అతీతంగా చేయాలని తెలిపారు. అనంతరం అంబేద్కర్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవి, ఉపాధ్యక్షుడిగా అనిల్‌కుమార్, అర్జున్, ప్రధాన కార్యదర్శిగా పరమేష్, భాస్కర్, సురేష్, కోశాధికారిగా శ్రీను, ప్రచార కార్యదర్శిగా రాకేష్ పలువురు ఉన్నారు.

యువకుల చేతిలోనే దేశ భవితవ్యం



కల్వకుర్తిరూరల్: యువకులు తలుచుకుంటే ఏదైనా సాధ్యమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అర్జున్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్‌తండాకు చెందిన 20 మంది యువకులు పార్టీలో చేరారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టి సత్తా చాటుతామన్నారు. కార్యక్రమంలో గోపాల్, ప్రవీణ్, నరేందర్, రాంచందర్, నితిన్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్ప్రవర్తన కీలకం



బిజినేపల్లి: విద్యార్థులకు కరాటేతో పాటు సత్ప్రవర్తన కూడా నేర్పించాలని, అప్పుడు మంచి ఫలితాలు వస్తాయని ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో తైక్వాండో కలర్ బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బెల్ట్‌తో గౌరవించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి పుల్లేందర్‌రెడ్డి, మాస్టర్ మాసయ్య, సురేందర్, శేఖర్, ధన లక్ష్మి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు




పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఈ ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉండడం వల్ల ఈ ఆదివారం 4వేల మంది భక్తులు హాజరైనట్లు ఎండోమెంట్ అధికారి సత్యచంద్రారెడ్డి తెలిపారు. టికెట్ల హుండీ మొత్తం రూ.1.60 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చారకొండ: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం అని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని జూపల్లికి చెందిన గుడూరి మల్లేష్ చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. రూ.60వేల చెక్కును ఆదివారం ఎమ్మెల్సీ నివాసంలో లబ్ధిదారుడికి అందజేశారు. ప్రజాఆరోగ్యంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్యయాదవ్, కొండల్, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

రామాలయంలో ధ్వజారోహణ పూజలు



కొల్లాపూర్: పట్టణంలోని రామాలయంలో ఆదివారం ధ్వజారోహణ పూజలు కొనసాగాయి. శ్రీరామ నవమి సందర్భంగా ఈనెల 1వ తేదీ నుంచి రామాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణ అనంతరం సుదర్శనహోమం చేశారు. సోమవారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

కాల్వల విస్తరణతో ఆనందం

- మండలంలో 10 వేల ఎకరాలకు సాగునీరు
- 9 పంచాయతీలకు ప్రయోజనం
- 2కి.మీ. మేర మట్టి కాల్వ పూర్తి



ఫిరట్వానిపల్లి శివారులో తీసిన కేఎల్‌ఐ మట్టి కాల్వ

ఉప్పునుంతల: తీవ్రమైన కరువుతో ఇబ్బందిపడుతున్న మండలంలోని శ్రీశైలం–హైదరాబాద్ రహదారికి తూర్పు దిశగా ఉన్న 9 పంచాయతీలకు కేఎల్‌ఐ కాల్వల విస్తరణతో సాగు, తాగునీటి కష్టాలు తీరనున్నాయి. విస్తరణ పనులు మంజూరై పనులు కొనసాగుతుండటంతో ఆయా గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న 27 పంచాయతీల్లో ఇప్పటికే 18 పంచాయతీలకు పుష్కలంగా కేఎల్‌ఐ నీరు అందుతుంది. మిగిలిపోయిన 9 పంచాయతీలకు ప్రస్తుతం కాల్వ ద్వారా సాగునీరు అందే పరిస్థితులు మండలంలో నెలకొననున్నాయి.

10వేల ఎకరాలకు సాగునీరు..

అచ్చంపేట మండలం పులిజాల వద్ద నిలిచిపోయిన కేఎల్‌ఐ కాల్వ వద్ద నుంచి ఉప్పునుంతల మండలంలో చివరగా ఉన్న పెనిమిళ్ల శివారు వరకు మొత్తం 15వేల ఎకరాలకు సాగునీరు అందేలా 15 కిలోమీటర్ల కాల్వ కోసం రూ.95కోట్లు మంజూరయ్యాయి. ఈ కాల్వ పులిజాల నుంచి హాజీపూర్ మీదుగా మండలంలోని రాయిచెడ్ శివారులో మండలంలోకి అడుగుపెడుతుంది. మండలంలోని రాయిచెడ్, ఫిరట్వానిపల్లి, అయ్యవారిపల్లి, ఈరటావ్యనిపల్లి, లత్తీపూర్, గువ్వలోనిపల్లి, పెనిమిళ్ల, సీబీ తండా, పూర్యానాయక్‌తండా పంచాయతీలకు ప్రయోజనం చేకూరనుంది. ఆయా గ్రామాలకు చెందిన 10వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. మెయిన్ కెనాల్‌తోపాటు ఆయకట్టును కవర్ చేయడానికి 14 పిల్ల కాల్వలు తవ్వనున్నారు. ప్రస్తుతం మండలంలోని ఫిరట్వానిపల్లి శివారులో మెయిన్ కెనాల్ పనులు చేపడుతున్నారు. ఇప్పటి వరకు 2కిలోమీటర్ల మేర మట్టి కాల్వను తీశారు. అదేవిధంగా అయ్యవారిపల్లి శివారు నుంచి పెనిమిళ్ల వరకు వెళ్లే డీ–8 పిల్ల కాల్వ పనులు మూడు కిలోమీటర్ల వరకు తీశారు. కాల్వల్లో భూములు నష్టపోతున్న రైతులకు ఎకరాకు రూ.9.39లక్షలు పరిహారం అందిస్తున్నారు.

ఎమ్మెల్యే పట్టుదలతోనే..



కొన్నేళ్లుగా కరువుతో అల్లాడుతున్న మండలంలోని 9 పంచాయతీలకు సాగునీటిని అందించాలని ఎమ్మెల్యే బాలరాజు పట్టుదలతోనే ప్రస్తుతం కేఎల్‌ఐ కాల్వ పనులు మంజూరయ్యాయి. పెనిమిళ్లలో పదేళ్ల కిందట వర్షాలు పుష్కలంగా ఉండి భూగర్భజలం బాగున్నప్పుడు యాసంగిలో వేరుశనగ సాగులో ఈప్రాంతంలోనే టాప్‌గా ఉండేది. ప్రస్తుతం నీటి వసతి లేక సాగు పూర్తిగా తగ్గిపోయింది.

– చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్

మొక్కల రక్షణ అందరి బాధ్యత



కేఎల్‌ఐ కాల్వను పరిశీలిస్తున్న అధికారులు

వెల్దండ: హరితహారంలో నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాలని రాష్ట్ర కెనాల్‌బ్లడ్ ప్లాంటేషన్ అధికారి, ఇరిగిగేషన్ డీఈ నాగభూషణం పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని లింగారెడ్డిపల్లిలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాల్వలకు ఇరువైపుల గట్లకు నాటిన మొక్కలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కెనాల్ చుట్టూ నాటిన మొక్కలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. హరితహారంలో భాగంగానే కాల్వ గట్లకు నాటిన మొక్కలను సక్రమంగా పెరిగేలా చూడాలన్నారు. వారి వెంట ప్లాంటేషన్ మేనేజర్ శివరాములు, క్రాంతికుమార్, జీవన్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, ఈశ్వర్, సిబ్బంది ఉన్నారు.

గెలుపొందిన జట్లకు బహుమతుల ప్రదానం



బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తిరూరల్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సూచించారు. పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన కల్వకుర్తి ప్రీమియర్‌లీగ్ –2 ముగింపు సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ పోటీలలో అర్జున్‌రెడ్డి టీం విజేతగా నిలిచింది. విజేతలకు ప్రథమ బహుమతి రూ.లక్షను ఎమ్మెల్యే, సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్దన్, వరప్రసాద్‌రెడ్డి, మధు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

మహిళలు రాజకీయాల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న నళినిరామన్

కల్వకుర్తిరూరల్: మహిళలమనే చిన్నచూపును పక్కనపెట్టి రాజకీయాల్లో సత్తా చాటాలని బీజేపీ మహిళమోర్చ జాతీయ కార్యదర్శి నళినిరామన్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ మహిళామోర్చ కార్యవర్గ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నరేంద్రమోడీ నాయకత్వంలో దేశం ప్రపంచంలోనే శక్తివంతంగా మారిందన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందన్నారు. రాబోయే రోజుల్లో మహిళలు పార్టీకి అండగా నిలిచి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి మాట్లాడుతూ మహిళా శక్తిని చాటాలని, మహిళలకు అండగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో ఇందిర, జానకి, గీతారాణి, మంజుల, ఉమ, శారదమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం



గౌరెడ్డిపల్లిలో వీధులను శుభ్రం చేస్తున్న యువజన సంఘం సభ్యులు

తెలకపల్లి: విప్లవవీరుడు భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని భగత్‌సింగ్ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం మండలంలోని గౌరెడ్డిపల్లిలో భగత్‌సింగ్ యువజన కమిటీని ఎన్నుకున్నారు. అతి చిన్నవయస్సులో భగత్‌సింగ్ దేశం కోసం తన ప్రాణాలు అర్పించారని ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులు భగత్‌సింగ్ విగ్రహ పరిసరాలతో పాటు వీధులను శుభ్రం చేశారు. అధ్యక్షుడిగా మల్లేష్, ఉపాధ్యక్షులుగా రవి, నరేష్, ప్రధాన కార్యదర్శులుగా ఆంజనేయులు, చే గువేరా, శివ, కిరణ్, సహాయ కార్యదర్శిగా రాజు, సాయి, చిన్నరాజు, రామకృష్ణ, సభ్యులుగా వెంకట్, కాశీం, నర్సింహ, బాలకృష్ణ, బాలస్వామి, శ్రీకాంత్, సుధాకర్, గణేష్, కుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

మాదిగల అభ్యున్నతికి కృషి చేయాలి

వెల్దండ: మండలంలోని మాదిగల అభ్యున్నతికి ఐక్యవేదిక ద్వారా కృషి చేయాలని కార్యనిర్వహక సభ్యుడు జయప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం ఐక్య వేదిక అధ్యక్షుడు అంజయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో మాదిగల సమస్యలపై పోరాటం చేసి న్యాయం చేయాలన్నారు. ఐక్యవేదిక ద్వారా రాజకీయ, విద్యా, ఆర్థిక, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. అనంతరం కార్యవర్గాన్ని పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, దార్లకుమార్, జంగయ్య, ప్రభాకర్, సోమయ్య, నాగేష్, పుల్లయ్య, జంగయ్య, మల్లేష్, అంజయ్య, జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.

సమష్టిగా బొడ్రాయి పండుగ



ఉప్పునుంతలలో సమావేశమైన గ్రామస్తులు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో కులమతాలకు అతీతంగా సమష్టిగా బొడ్రాయి పండుగను సంతోషంగా నిర్వహించాలని గ్రామపెద్దలు అన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీ ఆవరణలో బొడ్రాయి పండుగ కోసం ముందస్తుగా గ్రామస్తులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మే చివరి వారం లేదా జూన్ మొదటి వారంలో పండుగను నిర్వహించడానికి అనువుగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కులాల వారీగా పెద్దలను కమిటీ సభ్యులుగా నమోదు చేశారు. మరోసారి సమావేశమై పండుగకు అయ్యే ఖర్చు, తేదీ ఖరారు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో చిన్న జనార్దన్‌రెడ్డి, అనంతరెడ్డి, కొత్త జంగిరెడ్డి, కృష్ణయ్య, కుమారస్వామి, నర్సయ్య, రాములు, సుధాకర్, రామచంద్రయ్య, జంగయ్య, బాల్‌నారాయణ, తిర్పతయ్య, శ్రీను, పరమేష్, మల్లయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని పురాతన శివాలయం పునర్నిర్మాణానికి ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి ఆదివారం రూ.లక్ష చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీపతిరాజు, గణేష్, హసన్, కొండల్, ఆలయ నిర్వాహకులు రమేష్‌యాదవ్, రాజు, కృష్ణయ్య యాదవ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుదాం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడుతున్నామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు జగన్ అన్నారు. ఆదివారం మండలంలోని జీడిపల్లిలో హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబండలో భారీ ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను వివరించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని సీఎం కేసీఆర్ అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజలను దోచుకుంటున్నారని, రాష్ట్రాన్ని, దేశాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌ను అమలు చేస్తామని, రూ.500కే సిలిండర్ ఇస్తామని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో చంద్రకాంత్‌రెడ్డి, రేణయ్య, అనిల్‌గౌడ్, జంగయ్యగౌడ్, శ్రీనివాస్, సుదర్శన్, శంకర్, శ్రీకాంత్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండలంలోని శంకరకొండతండాకు చెందిన ఇస్లావత్ మన్యనాయక్ కుటుంబానికి ఆదివారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఈయన హైదరాబాదులో చికిత్స పొందుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జీవన్, రాజు, రాములు, గోపి, రవీందర్, రవి, శంకర్, గోపాల్ తదితరులు ఉన్నారు.

‘బలగం’ సినిమా ప్రదర్శన



తెలకపల్లి: ఇటీవల విడుదలైన బలగం సినిమాను మండలంలోని లక్నారంలో ప్రదర్శించారు. శనివారం రాత్రి సర్పంచ్ పల్లవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి సహకారంతో గ్రామంలోని కూడలిలో ప్రొజెక్టర్ ద్వారా సినిమాను తిలకించారు. ఈ సినిమా రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉందని సర్పంచ్ తెలిపారు.

కళాకారులకు మహానంది జాతీయ అవార్డు



కోడేరు: మండలంలోని మైలారం చెందిన కళాకారులు డప్పుస్వామి, సువర్ణ దంపతులు హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభ ఆవరణలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఉగాది మహానంది జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

పోరాట వీరుడు సర్వాయి పాపన్నగౌడ్



కొల్లాపూర్‌లో నివాళి అర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

కొల్లాపూర్: సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్వాయి పాపన్నగౌడ్ వీరోచిత పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటస్వామిగౌడ్, గోవిందుగౌడ్, రాజశేఖర్‌గౌడ్, సురేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సాయికృష్ణగౌడ్ తదితరులున్నారు.



పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి: బహుజనుల రాజ్యాధికారం కోసం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాడిన వ్యక్తి అని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రాజేందర్ గౌడ్, సర్పంచ్ సత్యం, ఎంపీటీసీ రవికుమార్, సాయికుమార్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని బీఎస్‌ఎఫ్ నాయకుడు రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యం ఫీజులు చెల్లించలేదని విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్‌ఎంలను ఏర్పాటు చేయాలని విద్యార్థులకు మజ్జిగ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని కోరారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



తాడూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారి రాజయ్య

అమ్రాబాద్: ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో సోమవారం నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అమ్రాబాద్, పదర మండలాల్లో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పదర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 133 మంది విద్యార్థులు, అమ్రాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో 113 మంది విద్యార్థులు, మన్ననూర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 307 మంది విద్యార్థులు, దోమలపెంట ప్రభుత్వ హైస్కూల్‌లో 45 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నరని ఎంఈఓ బాలకృష్ణ తెలిపారు.

ఉప్పునుంతల: మండలంలో ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ రామారావు తెలిపారు. ఉప్పునుంతల, కాంసానిపల్లి, వెల్టూర్, పెనిమిళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లతో పాటు స్థానిక కేజీబీవీ విద్యార్థులు మొత్తం 168 మంది పరీక్షలు రాయనున్నారని ఎంఈఓ తెలిపారు. పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌గా అర్జునయ్య, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా శ్రీధర్‌రావు వ్యవహరించనున్నారని ఎంఈఓ పేర్కొన్నారు.

తాడూరు: గతంలో మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రం నిర్వహించగా ప్రస్తుతం భవనం నిర్మాణ దశలో ఉన్నందున కేంద్రాన్ని కేజీబీవీ పాఠశాలకు మార్చినట్లు ఎంఈఓ భాస్కర్ రెడ్డి తెలిపారు. కేజీబీవీతో పాటు సిర్సవాడ ఉన్నత పాఠశాలలో 2వ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిర్సవాడ కేంద్రంలో బలాన్‌పల్లి 17 మంది, సిర్సవాడ 46, ఐతోల్ 29, కుమ్మెర 51 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కేజీబీవీ కేంద్రంలో ఇంద్రకల్ 50, తాడూరు 97, మేడిపూర్ 53, కేజీబీవీ 40 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

లింగాల: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలలో మొత్తం 258 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఆదివారం ప్రకటనలో తెలిపారు. లింగాల, అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కస్తూర్బా విద్యాలయం, బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 108 మంది, సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలలో 150 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

సకాలంలో హాజరుకావాలి

పెద్దకొత్తపల్లి: 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని ఎంఈఓ చంద్రుడు తెలిపారు. ఇతర గ్రామాల విద్యార్థులు ఆర్టీసీ బస్సులలో హాల్‌టికెట్ చూపిస్తే ఉచితంగా కేంద్రానికి చేరవేస్తారని వివరించారు. మూడు కేంద్రాలలో 547 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

దోమలపెంట(అచ్చంపేట): ఈస్టర్ పండుగ ముందు ఆదివారాన్ని క్రైస్తవులు మట్టల ఆదివారం(పామ్ సండే) ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ ఆశీర్వాదం మట్టల ఆదివారం సందేశాన్ని తెలిపారు. క్రైస్తవులు కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.



అసంపూర్తిగా రైతువేదికలు



తాడూరు: మండల కేంద్రంతో పాటు చర్ల ఇటిక్యాల, అల్లాపూర్, బలాన్‌పల్లి, ఇంద్రకల్‌లోని రైతువేదికలు 90శాతం పూర్తి కావచ్చినా మిగతా 10శాతంపనులు పూర్తి చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇంద్రకల్, అల్లాపూర్, తాడూరు, బలాన్‌పల్లిలో పనులు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. అధికారులు పరిశీలించి అసంపూర్తిగా ఉన్న రైతువేదికలను పూర్తి చేసి, వాటిని ప్రారంభించాలని గ్రామాల రైతులు కోరుతున్నారు.